ఫలించిన పోరాటం

వారి పోరాటం ఫలించింది. పలు శాఖల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. కీలకమైన ప్రాజెక్టు పట్టాలెక్కింది. ఆర్‌వోబీ నిర్మాణ పనుల్లో కదలిక వచ్చింది. దీంతో ఐలా ప్రతినిధులతో పాటు పది గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- వడ్లపూడి వద్ద ఆర్‌వోబీ పనులకు లైన్ క్లియర్
- రూ.23 కోట్ల కేటాయింపు, ఆర్‌అండ్‌బీకి అప్పగింత
- హర్షం వ్యక్తం చేస్తున్న ఐలా ప్రతినిధులు


అలంకారప్రాయంగా రైల్వే ట్రాక్ పై నిర్మించిన బ్రిడ్జి సెంటర్ పాయింట్


వడ్లపూడి వద్ద గేటు పడితే వాహనచోదకుల అవస్థలు

అక్కిరెడ్డిపాలెం: వడ్లపూడి వద్ద ఆర్‌వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి) నిర్మాణానికి లైన్‌క్లియర్ అయింది. ఇది పూర్తయితే సుమారు 10 గ్రామాలు, 8 బ్లాక్‌ల కష్టాలు తీరనున్నాయి. దీంతో వేలాది మంది ఆనందానికి అవధుల్లేకుండా పోతున్నాయి. ఆటోనగర్‌లో సుమారు 350 నుంచి 400 వరకు సూక్ష్మ, మధ్య తరహా, భారీ పరిశ్రమలు ఉన్నాయి. రైల్వే ట్రాక్ ఇరువైపులా ఉన్న ఈ పరిశ్రమలకు పలు రాష్ట్రాలు, జిల్లాల నుంచి ముడి సరకులు, మెషీన్లు, ఇతర వస్తువులు ఎగుమతి, దిగుమతి అవుతాయి. దీనిలో భాగంగా భారీ, అతిభారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇరువైపులా ఉన్న గ్రామాలకు చెందిన వేలాది మంది వాహన చోదకులు, పలు ప్రాంతాల్లో ఉద్యోగాల రీత్యా, ఇతర పనుల మీద బయలు దేరే సమయానికి వడ్లపూడి వద్ద రైల్వే గేటు పడుతుండడంతో సమయానికి చేరుకోలేక పోతున్నారు. ట్రాఫిక్‌లో చిక్కుకుని నరకయాతన అనుభవించే వారు. ఎట్టకేలకు ఆర్‌వోబీ నిర్మాణ పనులు ప్రారంభం కానుండడంతో హమ్మయ్యా అంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

ఆటోనగర్ దరి చుక్కవానిపాలెం, వడ్లపూడి వద్ద ఆర్‌వోబీ నిర్మాణం కోసం పదేళ్లుగా ఐలా ప్రతినిధులు పోరాటం చేశారు. దీంతో సుమారు రూ.23 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు చేపట్టారు. ఎట్టకేలకు అన్ని రకాల అనుమతులు లభించి పనులు ప్రారంభం కావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైల్వేశాఖ రైల్వే ట్రాక్‌పై బ్రిడ్జి పనులు పూర్తి చేసింది. సుమారు 800 మీటర్ల ఆర్‌వోబీ పనుల్లో భాగంగా బి - బ్లాక్ నుంచి ఎఫ్ బ్లాక్ వరకు ఆర్‌వోబీ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఆర్ అండ్ బీ, రైల్వే, ఐలా సంయుక్తంగా పూర్తి చేయాల్సిన పనులు కొన్ని అవాంతరాల వల్ల నిలిచి పోయాయి. చివరకు ఆర్ అండ్ బీ, ఐలా, కేంద్ర నిధులతో ఎగ్రిమెంట్ చేసుకుని ఆర్‌అండ్ బీకు అప్పగించారు. 2 నుంచి 3 ఏళ్లలో ఆర్‌వోబీ పనులు పూర్తి చేయాల్సి ఉంది.

పనులు వేగవంతం

ఆర్‌వోబీ నిర్మాణం చేయాల్సిన ప్రాంతంలో మట్టి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మెషినరీ డంప్ చేశారు. నిర్మాణం పూర్తయితే జగ్గరాజుపేట, కాపుజగ్గరాజుపేట, వడ్లపూడి, ఫకీర్‌తక్యా, యాదవజగ్గరాజుపేట, గ్రీన్ సిటీ, ఎస్‌టీబీఎల్, ఎస్టీబీఎల్ క్వార్టర్స్, దువ్వాడ, కూర్మన్నపాలెం, అగనంపూడిలోని సుమారు 5 గ్రామాలు, కొండయ్యవలస, తుంగ్లాంతో పాటు ఆటోనగర్‌లోని బి, బీ ఎక్స్‌టెన్షన్, డి, డీ ఎక్స్‌టెన్షన్, ఈ, ఎపెరల్‌పార్క్, ఎఫ్, ఈ, జి బ్లాక్‌లకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

విజయం సాధించాం



ఆర్‌వోబీ నిర్మాణం కోసం సంబంధిత అధికారులు, నాయకులను కలిసి ఎంతో శ్రమించాం. ఆర్‌వోబీ పూర్తయితే ఇటు పరిశ్రమలు, ప్రజలుకు ఉపయుక్తంగా ఉంటుంది. బహుళ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పారిశ్రామిక వేత్తల సహకారం తీసుకొని చివరకు విజయం సాధించాం. చాలా ఆనందంగా ఉంది.

–కె.సత్యనారాయణ రెడ్డి (రఘు), ఆటోనగర్ ఐలా చైర్మన్

ఎంతో వెసులు బాటు



వడ్లపూడి వద్ద నిత్యం గూడ్సు రాకపోకల సమయంలో గేటు పడి ఇబ్బందులు పడేవారం. పరిశ్రమలకు వచ్చే లారీలు, వాహన చోదకులు నిలిచిపోయేవి. ఆర్‌వోబీ నిర్మిస్తే ఎంతో వెసులు బాటు ఉంటుంది. త్వరతగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

–చీకటి సత్యనారాయణ, కార్యదర్శి, ఆటోనగర్ ఐలా

ఇబ్బందులు తప్పుతాయి



ఆటోనగర్ నుంచి కూర్మన్నపాలెం వెళ్లేందుకు వడ్లపూడి వద్దకు వచ్చే సరికి రైల్వే గేటు పడేది. ఇరువైపులా వందలాది వాహనాలు ఆగిపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. నిత్యం ఇదే తంతు. ఆర్‌వోబీ పనుల ప్రారంభం అవుతున్నాయని తెలిసి ఆనందంగా ఉంది.

–గోపిశెట్టి సన్యాసిరావు, నాతయ్యపాలెం

నుయ్యి కాదు... గొయ్యే!


లంకెలపాలెం కూడలిలో ఆర్‌ఈసీఎస్ కార్యాలయం ఎదురుగా రహదారి దుస్థితి

అగనంపూడి: మూడు రోజుల పాటు కురిసన వర్షాలకు రహదారులు గోతులమయంగా మారాయి. జీవీఎంసీ 85వ వార్డు లంకెలపాలెం కూడలి నుంచి పెదముషిడివాడ వైపు వెళ్లే మార్గంలో ఆర్‌ఈసీఎస్ కార్యాలయం ఎదురుగా రహదారి పూర్తిగా ధ్వంసమైంది. డివైడర్‌కు ఒక భాగం దాదాపు కోతకు గురవ్వడంతోపాటు రెండున్నల అడుగుల లోతులో గొయ్యి ఏర్పడింది. దీంతో భారీ వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ గోతిలో మంగళవారం రాత్రి జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీకి చెందిన తవిటయ్య అనే ద్విచక్రవాహనచోదకుడు పడి తూలి కింద పడిపోయాడు. ఆ సమయంలో వెనుక నుంచి వాహనాలు ఏవీ రాకపోవడంతో తవిటయ్య స్వల్ప గాయాలతో బయటపడ్డారు. జీవీఎంసీ అధికారులు స్పందించి గోతులను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

పోషకాహారంతో అందమైన జీవితం

అక్కిరెడ్డిపాలెం: పోషకాహారంతో అందమైన జీవితాన్ని పొందవచ్చని షీలానగర్ కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ డైటీషియన్ శిరీష అన్నారు. జాతీయ పోషకాహార వారోత్సవాలను పురస్కరించుకొని షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో బుధవారం పోషకాహారాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది థీమ్ ఫీడింగ్ స్మార్ట్ రైట్ ఫ్రమ్ స్టార్ట్ (ప్రారంభం నుంచే సరైన పద్ధతిలో ఆహారం అందించడం) అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు, సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందరూ ఆహార నియమాలు పాటించి ఆరోగ్యంగా జీవించాలని సూచించారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

అక్కిరెడ్డిపాలెం: 11 కేవీ మింది ఫీడర్, 11 కేవీ గాజువాక ఫీడర్ల పరిధిలో 33/11 కేవీ బీహెచ్‌పీవీ సబ్‌స్టేషన్‌లోని 11 కేవీ లైన్లకు అవాంతరంగా ఉన్న చెట్ల కొమ్మలను శుక్రవారం తొలగిస్తున్నట్లు జోన్2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా మింది, రాంనగర్, గిరిప్రసాద్ కాలనీ, రాజీవ్ నగర్, బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీస్ తదితర ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. సిబ్బందికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా ఉతర నక్షత్ర పూజలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం అయ్యప్పస్వామికి ఉత్తర నక్షత్ర పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వేకువ జామున ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు నాగేశ్వర శర్మ నేతృత్వంలో స్వామికి అష్టాభిషేకం నిర్వహించారు. విశేష అలంకరణలో దర్శనమిచ్చిన అయ్యప్ప స్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ


వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న సిగడం లక్ష్మి కుటుంబ సభ్యులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో బుధవారం మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. రక్షణ విభాగంలో విధులు నిర్వర్తిస్తూ స్వర్గస్తులైన సిగడం చైతన్య జ్ఞాపకార్థం తల్లిదండ్రులు సిగడం సత్యనారాయణ, లక్ష్మి దంపతులు మట్టి వినాయక ప్రతిమలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు సంగ్రాన నూకరాజు, ఆర్‌పీ కనక మహాలక్ష్మి, గొంతిన సత్యవతి, కణితి చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం

గాజువాక: జీవీఎంసీ 67వ వార్డు గాజువాక హైస్కూల్ రోడ్‌లో పర్యావరణ ప్రజా పౌర హక్కుల రక్షక సాంఘిక సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో ఆధార్ సేవా కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ కేంద్రంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సేవలు అందిస్తామని నిర్వాహకుడు విశ్వనాథ్ తెలిపారు. ఈనెల 8వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందన్నారు.

నిత్యావసర సరకుల అందజేత

అగనంపూడి: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన 85వ వార్డు పెదమడకకు చెందిన వింధుల నరసింగరావు కుటుంబానికి శ్రీపద్మ మార్కండేయ సేవా సంఘం ప్రతినిధులు నెలకు సరిపడా బియ్యం, నూనె, కందిపప్పు, ఇతర నిత్యావసర సరకులు అందించారు. సంఘ గౌరవాధ్యక్షుడు కొలిపాక అప్పారావు మాట్లాడుతూ అగనంపూడి పరిసర ప్రాంతంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సేవా సంఘం ప్రతినిధులు బేతా హనుమంతురావు, గంధోళి పైడికొండ, నరసింగరావు, వరలక్ష్మి, గంధోళి వెంకటరమణ, పచ్చారి రామలక్ష్మణ్, గుదే రాజు పాల్గొన్నారు.

22 మందికి జరిమానా

అక్కిరెడ్డిపాలెం: గాజువాక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 22 మందికి జరిమానాలు విధించగా, వారిలో ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు గాజువాక ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. బుధవారం వీరిని 3వ స్పెషల్ జుడీషియల్ మెజిస్ట్రేట్ 2 క్లాస్ కోర్టు టి.వి.రమణ మూర్తి ఎదుట హాజరు పర్చగా ఒక్కొక్కరికి రూ.3 వేల నుంచి రూ.7 వేలు జరిమానా విధించారు. వీరిలో లారీ డ్రైవర్ శ్రీనివాసరావుకు జరిమానాతో పాటు 7 రోజుల జైలు శిక్ష, ఆటో డ్రైవర్ రాజు బాబుకు జరిమానాతో పాటు 3 రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. 22 మందికి కలిపి మొత్తం రూ.75,100లు జరిమానా విధించినట్లు చెప్పారు.

బకాయిలు జమ చేయాలని వినతి


డీజీఎం రాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: థ్రిఫ్ట్ సొసైటీకు ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే జమ చేయాలని థ్రిఫ్ట్ సొసైటీ పాలకవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం థ్రిఫ్ట్ సొసైటీ పాలకవర్గం ఆధ్వర్యంలో ప్లాంట్‌లోని పే సెక్షన్ వద్ద ధర్నా చేశారు. ధర్నాకు పలు కార్మిక సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ మాట్లాడుతూ జిందాల్, టాటాలకు వడ్డీతో చెల్లిస్తున్న యాజమాన్యం థ్రిఫ్ట్ సొసైటీకు బకాయిపడ్డ రూ. 60.24 కోట్లను 12 శాతం వడ్డీతో చెల్లించాలని డిమాండ్ చేశారు. రూ. 370 కోట్ల టర్నోవర్‌తో నడుస్తున్న థ్రిఫ్ట్ సొసైటీను ఆర్థికంగా దెబ్బ తీయాలని యాజమాన్యం చూస్తే సహించబోమన్నారు. అనంతరం పే సెక్షన్ డీజీఎం రాంప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో థ్రిఫ్ట్ సొసైటీ ఉపాధ్యక్షులు కె. ఆనంద్‌కుమార్, కార్యదర్శి డి. శ్రీరామచంద్రమూర్తి, వివిధ కార్మిక సంఘాల నాయకులు వై.టి. దాస్, యు. రామస్వామి, వెంకటేశ్వరరావు, డి. అప్పారావు, జి. నరేంద్ర, కొమ్మినేని శ్రీనివాస్, రామ్‌కుమార్, మహాలక్ష్మినాయుడు, ప్రసాద్,పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

యాజమాన్యం నిర్లక్ష్యంతో ఉత్పత్తికి గండి


దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న పరిరక్షణ కమిటీ నాయకుడు రామస్వామి

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం నిర్లక్ష్యంగా కారణంగా సంస్థలో కేవలం బీఎఫ్–3లోనే ఉత్పత్తి సాగుతుందని విశాఖ ఉక్కు ఉరిరక్షణ కమిటీ నాయకులు యు.రామస్వామి ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన 1301వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు.రెండు రోజులుగా కేవలం ఒక బ్లాస్ట్ ఫర్నేస్‌లో మాత్రమే ఉత్పత్తి సాగుతుందని, అదీ కూడా తక్కువగా ఉత్పత్తి చేస్తున్నారని, దీనికి యాజమాన్యం నిర్లక్ష్య ధోరణే కారణమన్నారు. జీతాలు సకాలంలో చెల్లించకుండా కార్మికులను మానసిక ఆందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 10వ తేదీన రాస్తారోకోతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ పాల్గొని విజయవంతం చే యాలని కోరారు. కా ర్యక్రమంలో స్టీల్ సీటూ నాయకులు కె.గంగాధర్, వీరస్వామి, పీజేకేరాజు, డీఎస్‌వీఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం


అప్పికొండ తీరంలో శుభ్రం చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


కేఎన్‌పాలెం పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న ఉపాధ్యాయుడు

పెదగంట్యాడ: విద్యార్థులకు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరించడమే స్వచ్ఛతా పక్వాడా లక్ష్యమని చాపలపాలెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూరపాటి వినోద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు చాపలపాలెం మండల ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అప్పికొండ తీరంలో చెత్తాచెదారాలు ఏరివేసి శుభ్రం చేశారు. పాఠశాల సిబ్బంది హేమంత్‌కుమార్, కొర్లమ్మ, గంటాలమ్మ పాల్గొన్నారు.

కేఎన్‌పాలెం ఎంపీపీ పాఠశాలలో

77వ వార్డు పరిధి కేఎన్ పాలెం ఎంపీపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయరాలు శ్యామల ఆధ్వర్యంలోపాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సాబీర్ అలీ, వైస్ చైర్మన్ పుష్ప, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కు హెచ్‌ఆర్ అధికారి రాధికకు జాతీయ అవార్డు


కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి నాగేంద్ర సిన్హా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రాధిక

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ డీజీఎం డాక్టర్ దాసరి రాధిక 0జాతీయ స్థాయి జెండర్ డైవర్సిటీ అవార్డును అందుకున్నారు. ఇండియన్ స్టీల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం న్యూఢిల్లీలో జరిగిన ఇండియన్ కాంక్లేవ్ 2024లో ఆమెకు ఈ అవార్డును ప్రదానం చేశారు. పనిలో నిజమైన నాయకురాలిగా, స్టీల్‌ప్లాంట్‌లో క్లిష్టమైన జోన్లలో పని చేయడంతో పాటు సమ్మిళిత సంస్కృతిని కల్పించేందుకు ఆమె చేసిన కృషికి గుర్తింపుగా జెండర్ డైవర్సిటీ అవార్డును ప్రకటించారు. ఉక్కు పరిశ్రమకు చెందిన పలువురి సమక్షంలో కేంద్ర ఉక్కుమంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి నాగేంద్ర సిన్హా చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా స్టీల్ ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ ఆమెను అభినందించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన


అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హై స్కూల్ హెచ్‌ఎం నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న మహిమ


అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: తెలుగు భాషా దినోత్సవాలను పురస్కరించుకొని గోపాలపట్నం బాలుర జెడ్పీ హై స్కూల్లో మంగళవారం జిల్లా స్థాయి పద్య పఠన పోటీలు నిర్వహించారు. ఇందులో 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ 10వ తరగతి విద్యార్థి దనేటి మహిమ ప్రథమ స్థానం కైవశం చేసుకుంది. ఈ మేరకు బుధవారం పాఠశాలలో హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం చేతుల మీదుగా మహిమకు ప్రశంసా పత్రంతో పాటు పూర్వగ్రంథలహరి పుస్తకం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, కృష్ణవేణి, శ్రీనివాసరావుతో పాటు కుమారస్వామి పాల్గొన్నారు.

నడుపూరు విద్యార్థులకు..


పెదగంట్యాడ: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గోపాలపట్నం హైస్కూల్ నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. వ్యాసరచన సీనియర్, జూనియర్ విభాగాల్లో రెండు ప్రథమ బహుమతులు, అష్టావధానంలో ద్వితీయ స్థానంలో నిలిచారు. పద్య పఠనం సీనియర్స్ విభాగంలో దేవిక ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, జూనియర్స్ విభాగంలో తనుశ్రీ ప్రథమ స్థానంలో సాధించింది. హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్, విద్యార్థులతో పాటు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు శంకర్, శివ, ధనలక్ష్మి, బాబ్జీ, చంద్రకళను అభినందించారు.

స్టీల్‌ప్లాంట్ నూతన అధికారులకు సత్కారం


స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్‌చార్జ్ మధుసూదనరావును సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్‌చార్జి, ఎస్సీ లైజన్ ఆఫీసర్లను స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ నాయకులు సత్కరించారు. ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్‌చార్జిగా ఎం.మధుసూదనరావు, ఎస్సీ లైజన్ ఆఫీసర్‌గా నల్లి సుందరం నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నాయకులు బుధవారం వారిని కలిసి తమ సమస్యలు వివరించారు. గత ఏప్రిల్ నుంచి పదవీ విరమణ చేసిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్ స్కీం అమౌంట్ చెల్లించలేదన్నారు. ఈనెల 12తో ప్రస్తుత అసోసియేషన్ కమిటీ గుర్తింపు గడువు ముగుస్తున్నందున.. నూతన కమిటీ ఏర్పాటుకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. స్టీల్‌క్లబ్ సంయుక్త కార్యదర్శి జి.సురేష్, సీనియర్ నాయకులు కొమ్ము ప్రసాదరావు, బి.డేవిడ్, ఆర్.కోటేశ్వరరావు, బలరామ్, గోపాల్, చింతా మోహన్‌రావు, జె.కె.ఎస్.నాథన్, అరవింద్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు బాసటగా..



ఆటోనగర్ వాసీవా, పీఐడబ్ల్యూఏ, ఐలా ఆధ్వర్యంలో ఫుడ్ తరలిస్తున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: వరద బాధితులైన విజయవాడలోని సింగ్‌నగర్, పాయకాపురం, కబేలా సెంటర్, భవానీపురం, జక్కంపూడికాలనీ ప్రాంత వాసులకు ఎస్టీబీఎల్ ప్రాజెక్ట్స్ అధినేత గుత్తికొండ బాలాజీ ఆర్థిక సాయంతో మంగళవారం, బుధవారం 10 వేల చొప్పున ఆహార పొట్లాలు, మంచినీటి బాటిళ్లను సమకూర్చారు. బుధవారం ముంపు ప్రాంతాల్లో వీటిని ప్రాజెక్ట్స్ సిబ్బంది స్వయంగా బాధిత నివాసాలకు వెళ్లిఅందజేశారు.

రొట్టెల పంపిణీ

విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆటోనగర్ వాసీవా, పీఐడబ్ల్యూఏ, ఐలా ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు సుమారు 15 వేల రొట్టెలు, 1060 వాటర్ బాటిళ్లు, 6300 బిస్కెట్ ప్యాకెట్లు వ్యానులో తరలించారు. బుధవారం డి– బ్లాక్ వద్ద వ్యానును వాసీవా అధ్యక్షుడు నజ్జా పాండురంగ ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రతినిధులు పర్చూరి ప్రభాకర్, ఐలా కార్యదర్శి చీకటి సత్యనారాయణ, నాగిరెడ్డి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, అధికారులు, సిబ్బంది

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం బాలల ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ప్రారంభించారు. అనంతరం ఆయన రక్తదానం చేసి దాని ఆవశ్యకతను వివరించారు. ఒకరు రక్తదానం చేయడం వల్ల ముగ్గురు ప్రాణాలను కాపాడిన వారవుతారని తెలిపారు. రక్తదాత ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ కార్యదర్శి దాట్ల కీర్తి, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, ఎస్ఈ బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్ రామరాజు, రేంజ్ ఆఫీసర్లు శ్యామల, శివానీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.